వైద్యుల నిర్లక్ష్యంతో కార్మికుడు మృతి

ఆసుపత్రిలో రోదిస్తున్న మృతుడు సత్యంగౌడ్ భార్య, కుమార్తె

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 9 : వైద్యుల నిర్లక్ష్యంతో భవన నిర్మాణ రంగం కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం పల్కపల్లికి చెందిన సత్యంగౌడ్(46) తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి శ్రీరాంనగర్ కాలనీ రోడ్డు నం.4లో భార్యాపిల్లలతో కలిసి ఉంటూ భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో సత్యగౌడ్ గ్యాస్ట్రిక్ సమస్యతో రాగన్నగూడలోని యాంజాల్ ఆసుపత్రిలో చేరాడు. సత్యంగౌడ్‌కు వైద్యం అందించిన వైద్యులు అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. అయితే ఆదివారం ఉదయం 8.30 గంటలకు సత్యంగౌడ్ కార్డియాక్ అరెస్ట్‌తో మృతిచెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే సత్యంగౌడ్ మృత్యువాతపడ్డాడని.. అతడి మృతికి యాంజాల్ ఆసుపత్రి వైద్యులే కారణమంటూ మృతుడి కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. వారికి మద్దతుగా సీపీఐ పార్టీ జిల్లా నాయకుడు యాదయ్య, సీపీఎం పార్టీ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శి కిషన్, బీజేపీ నాయకుడు రమేశ్, బీఎస్పీ నాయకులు కుమార్, సైదులు ఆందోళన చేపట్టారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యంతోనే సత్యంగౌడ్ మృతి చెందాడని, అతడి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల పరిహారం అందజేసి మృతుడి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

30వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

దీక్షలో పాల్గొన్న భూ బాధితులు

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 9 : శంకర్‌పల్లి మండలం కొండకల్, వెలిమెల తండా శివారులోని లంబాడా గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిలాదాకాల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 30వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షలో పాల్గొన్న భూ బాధితులు మాట్లాడుతూ.. తమ భూములను అక్రమంగా తీసుకున్న వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీక్షలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజు, తండావాసులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణపై వివక్ష

పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య

ఆమనగల్లు, ఫిబ్రవరి 9 : కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ ప్రయోజనాలకు ఉపయోగపడేలా ఉందని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య మండిపడ్డారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ మండల కేంద్రంలో హమాలీ కార్మిక నాయకులతో కలిసి పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు లబ్ధి చేకూరేలా బడ్జెట్ లేదని, వ్యవసాయ రంగానికి, విద్య, వైద్య రంగాలకు ఆశించిన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. తెలంగాణకు నిధులు కేటాయించడంలో కేంద్రం పూర్తిగా వివక్ష చూపిస్తున్నదన్నారు. రైతులకు ఉపయోగపడేలా ఎంఎస్‌పీ చట్టం తీసుకురాలేదని దుయ్యబట్టారు బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 10న ఇందిరా పార్కు వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహాధర్నాను నిర్వహించనున్నట్లు.. ఈ కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు తరలిరావాలి



సేవాలాల్ సేన భవనంలో మాట్లాడుతున్న గిరిజన నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 9 : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో గిరిజనులు పెద్దఎత్తున పాల్గొన్ని విజయవంతం చేయాలని గిరిజన నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన సేవాలాల్ సేన భవనంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్పతినాయక్, జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఈ నెల 15న సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జయంతి వేడుకల్లో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, నాయకులు భీక్యానాయక్, బీచ్యానాయక్, పత్యానాయక్, హీరాసింగ్, జవహర్‌నాయక్, శంకర్‌నాయక్, బిక్కూనాయక్, శ్రీను, పాండు, హరిలాల్, వినోద్, తులసీరాం, రాజు, కిషన్ పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలి

చల్లంపల్లి గ్రామంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కడ్తాల్, ఫిబ్రవరి 9 : సమాజంలో నేత్రదానంపై ఉన్న అపోహలు తొలగిపోవాలని పలువురు నాయకులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు గుర్క శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో కంటి వైద్యుడు చంద్రశేఖర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేత్రదానంపై ఉన్న అపోహలు తొలగించేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. నేత్రదానంతో వ్యక్తి చనిపోతూ మరో ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో 480 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, దృష్టి లోపం ఉన్నవారిని సరోజిని కంటి దవాఖానకు తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీవోఏ ఆనంద్, నాయకులున్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేద్దాం

కొందుర్గు, ఫిబ్రవరి 9 : సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో సోమవారం మాజీ మంత్రి కేటీఆర్ నిర్వహించతలపెట్టిన సభకు కొందుర్గు మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కొడంగల్‌లో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని, కొడంగల్ పర్యటనలో కేటీఆర్ సభ పెట్టి రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకుంటారన్నారు.



నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో చిన్నారులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

చిన్నారులకు ఆశీర్వాదం

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 9 : చేవెళ్ల మండల పరిధి ఊరెళ్ల గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీనివాస ఫంక్షన్ హాల్‌ను ఆదివారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జహంగీర్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, హన్మంత్ రెడ్డి ఉన్నారు.



లక్ష్మీనృసింహ్మస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వైభవంగా లక్ష్మీనృసింహ్మస్వామి కల్యాణోత్సవం

కడ్తాల్, ఫిబ్రవరి 9 : తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గల వేదాద్రిగుట్టపై వెలసిన లక్ష్మీనృసింహ్మస్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీచెన్నకేశవస్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది.

కల్యాణోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రజిని, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజిబూర్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో నీటి కష్టాలు

ఇర్విన్ గ్రామంలో ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

మాడ్గుల, ఫిబ్రవరి 9 : మండల పరిధిలోని ఇర్విన్ గ్రామంలో ప్రతాప్‌నగర్ కాలనీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు నుంచి మిషన్ భగీరథ మంచీ నీరు రాక కాలనీవాసులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. అధికారుకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు నిరుపయోగంగా ఉందని తెలిపారు. మిషన్ భగీరథ అధికారులను గ్రామస్తులు అడుగగా గేటు వాల్వ్ పోయిందని 12 వేలు ఖర్చవుతాయని చెప్పినట్లు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన

అంతారంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి తదితరులు

షాబాద్, ఫిబ్రవరి 9 : మారుమూల గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని అంతారం గ్రామంలో రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం చేపడుతున్న గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులున్నారు.

అంజన్నను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదు

మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

కొందుర్గు, ఫిబ్రవరి 9 : షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదని పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్ అన్నారు. చౌదరిగూడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అంజన్నను విమర్శించేస్థాయి, నైతిక అర్హత కాంగ్రెస్ పార్టీలో ఉన్నవారికి లేదన్నారు. అధికారంలో ఉండి హామీలను అమలు చేయమంటే ప్రతిపక్షాలపై విమర్శలు చేసేందుకే సమయం సరిపోతున్నదన్నారు. ఎక్కడకు పోయినా ప్రగతి విషయాన్ని పక్కన పెట్టి బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై విషం చిమ్మడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు పనిచేస్తున్నారన్నారు. గత పదేండ్ల కాలంలో అంజన్న చేసిన అభివృద్ధి ఏ పల్లెకు వెళ్లినా కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలని, ఇలాగే వ్యవహరిస్తే స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 9 : ఫరూఖ్‌నగర్ మండలంలోని కందివనం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామదేవతలు విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్మాత్మికతను మరింత పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివజ్యోతి, నాయకులు శంకరయ్యగౌడ్, జనార్దన్‌గౌడ్, అమ్రూనాయక్, శివశంకర్, రమేశ్, ఆంజనేయులు, పెంటయ్య, వెంకట్‌రెడ్డి, రాజు, వెంకటేశ్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

సీఆర్పీలు కావలెను

కొత్తూరు, ఫిబ్రవరి 9 : మహిళా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లుగా పనిచేయడానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తూరు మండలంలో పని చేయడానికి ఆసక్తి ఉన్నవారు మండంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం నుంచి ఫిబ్రవరి 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు 18 నుంచి 50 ఏండ్ల లోపు వయస్సు కలిగి ఉండాలి. పదో తరగతి పాసై ఉండాలి. మహిళా సంఘంలో సభ్యురాలై ఉండాలి. అలాగే వీరు సంఘాలను అడిట్ చేయడం, సంఘాలతో పనిచేయాల్సి ఉంటుంది. వీటితోపాటు ఆఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై ట్రైనింగ్ ఉంటుందన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీతో పాటు కంప్యూటర్‌పై అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.

14 నుంచి బ్రహ్మోత్సవాలు

కేశంపేట, ఫిబ్రవరి 9 : కేశంపేటలో అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల గోడపత్రికను మాజీ ఎంపీపీ విశ్వనాథం గ్రామస్తులతో కలిసి ఆదివారం ఆలయ ఆవరణలో విడుదల చేశారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు కొనసాగుతాయన్నారు. 14న పంచామృతాభిషేకం, రాత్రి కుంకుమార్చన, 15న ధ్వజారోహణం, గరుడ సేవ, భగవత్‌నామ సంకీర్తన, 16న వేంకటేశ్వరస్వామి అలంకరణ, 17న స్వామి వారి కల్యాణం, సహస్ర నామార్చన, రాత్రి భజన పోటీలు, 18న పూర్ణాహుతి, బండ్లతిరుగుట, 19న పట్టాభిషేకం, చక్రతీర్థం, మహాపూర్ణాహుతి, 20న పందెం బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.

ఇంటర్ లింక్ పనులు ప్రారంభం

నక్కలపల్లిలో ఇంటర్‌లింక్ పనులు ప్రారంభమవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్, ఫిబ్రవరి 9 : మొయినాబాద్ మండల పరిధిలోని నక్కలపల్లి, ఎతుబార్‌పల్లి గ్రామాల ప్రజలు ఎన్నో ఏండ్లుగా విద్యుత్ సమస్యలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి విద్యాశాఖ మంత్రిగా పని చేసిన మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి సహకారంతో గత ప్రభుత్వం నుంచి కృషి చేశామని మాజీ సర్పంచ్ స్వప్న తెలిపారు. ఎట్టకేలకు విద్యుత్ సమస్యకు మోక్షం లభించిందన్నారు. కేతిరెడ్డిపల్లి సబ్ స్టేషన్ నుంచి ఇంటర్ లింక్ పనులను ఆదివారం ప్రారంభించారు. దీంతో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నక్కలపల్లి గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఇంటర్ లింక్ పనులు పూర్తి చేసి కొత్త ఫీడర్‌ను ఏర్పాటు చేస్తే విద్యుత్ సమస్య ఉండదని విద్యుత్ ఏఈ హము తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం : మాట్లాడుతన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, ఫిబ్రవరి 9 : నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయ ఆవరణలో రూ.58లక్షలతో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ గోదామును పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆయన పాలకవర్గంతో కలిసి ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లిగుట్టపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదయ్య, సీఈవో నాగరాజు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

తుర్కయాంజాల్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారమందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ సూరజ్‌నగర్‌కాలనీ ఫేజ్ -3 కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి

బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న పార్టీ అధ్యక్షుడు రమేశ్

మంచాల, ఫిబ్రవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్ రాకుండా అడ్డుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మంచాల మండల అధ్యక్షుడు చీరాల రమేవ్ అన్నారు. ఆదివారం మంచాల మండలం లింగంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ స్థాయి విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేలా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని చెప్పారు. గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను ప్రజలు అడ్డుకుంటున్నారని.. ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటా ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పరమేశ్, ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు కిషన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, ప్రభాకర్, మహేందర్, భిక్షపతి, రాజేందర్‌రెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉచిత వైద్య శిబిరం

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 9 : మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం ఇందు అరణ్య ఎదురుగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బండ్లగూడ ఆనంద్‌నగర్‌లోని సన్‌రేస్ హాస్పిటల్, డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఉచిత పరీక్షలు నిర్వహించారు. పదుల సంఖ్యలో వచ్చినవారికి రక్త పరీక్షలతోపాటు బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దవాఖాన ప్రతినిధి సోమశేఖర్, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఆరుట్లలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సహకార సంఘం చైర్మన్ హనుమంత్‌రెడ్డి

మంచాల, ఫిబ్రవరి 9 : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడుతాయని సహకార సంఘం చైర్మన్ వెదిరె హనుమంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో వేణుగోపాలస్వామి జాతర ఉత్సవాల సందర్భంగా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్

టోర్నీకి ఎంపికైన యువకులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్

కేశంపేట, ఫిబ్రవరి 9 : యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందజేస్తామని బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకులు నల్లగొండలో జరిగే అండర్-19 క్రికెట్ టోర్నీకి ఎంపికవడంతో ప్రత్యేకంగా అభినందించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కె.అరుణ్‌తేజ్, పి.చరణ్, ఎస్.జశ్వంత్, ఎన్.నందులు క్రికెట్‌లో చక్కని ప్రతిభను కనబరుస్తూ నల్లగొండలో జరుగుతున్న అండర్-19క్రికెట్ టోర్నీకి ఎంపికవడం మన గ్రామానికి గర్వకారణమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికితీసేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలను నిర్మించారన్నారు. పల్లెల్లో ఉండే ప్రతి ఒక్కరూ నిత్యం క్రీడా మైదానానికి వెళ్లి సాధన చేయాలన్నారు. పట్టుదల, అంకిత భావంతో క్రీడల్లో రాణించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. నల్లగొండలో జరిగే టోర్నీలో చక్కని ప్రతిభను కనబరిచి మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఎలాంటి అవసరం ఉన్నా క్రీడాకారులకు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

నేడు బీఆర్ఎస్ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 9 : అబ్దుల్లాపూర్‌మెట్‌లోని వైఎన్ఆర్ గార్డెన్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.